క్లుప్తంగా

సంపదవనం పరిశీలన



వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌లో దశాబ్ది సంపద వనాన్ని అధికారులు మంగళవారం సందర్శించారు. వనంలో పెరుగుతున్న తొమ్మిది జాతుల మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెరుగుదల, ఫెన్సింగ్, నీటి సౌకర్యం, కమాన్, బోర్డు చుట్టూ ఫెన్సింగ్ గేట్లను పరిశీలించారు. వనంలో పెరుగుతున్న మొక్కలను చూసి ఫారెస్ట్ రేంజ్ అధికారి రాజేశ్వర్‌రావు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ శారద, బీట్‌ఆఫీసర్ ఖాజా మొహినొద్దీన్, ఏఈ తిరుపతి, రమేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



డిపాజిట్ పత్రాలు అందిస్తున్న బండారి రమేశ్

తిమ్మాపూర్: మండలం పోలంపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఖమ్మం తిరుపతి కుటుంబానికి గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు సహకారం అందించి ఉదారత చాటుకున్నారు. ఎంపీటీసీ బండారి రమేశ్ అందరి సహకారంతో రూ.90 వేలు సేకరించి గట్టుదుద్దెనపల్లి సొసైటీలో తిరుపతి కూతురు కావ్య పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈమేరకు డిపాజిట్ పత్రాలను ఎంపీటీసీ బండారి రమేశ్ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ బండారి రమేశ్‌కు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపగా గ్రామస్తులు అభినందించారు.

కులగౌరవాన్ని మందకృష్ణ తాకట్టు పెట్టారు

హుజూరాబాద్: స్వలాభం మాదిగలను కోసం మంద కృష్ణ మాదిగ మోసం చేశాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొల్లు బాబు అన్నారు. హుజూరాబాద్‌లో మంగళవారం మాట్లాడారు. కులగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టి లబ్ధిపొందుతున్నాడని ఆరోపించారు. మొన్నటి వరకు కేసీఆర్ దొరతనాన్ని ప్రశ్నించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరడం ఎంత మోసమో మాదిగలు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. కుల ముసుగులో ఎదిగిన నాయకులను దళిత సమాజం నమ్మడంలేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం కృషి చేస్తున్న కాంగ్రెస్‌ను ఎంపీ ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ఐడీ కార్డులు

హుజూరాబాద్: ఆర్‌ఎంపీ(రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్), ((ప్రైవేట్ మెడికల్ ప్రాక్టిషనర్) పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ పెట్టుకోకూడదని, సంబోధించకూడదని ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూచన సమ్మయ్య అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మంగళవారం హుజూరాబాద్‌కు వచ్చారు. సమ్మయ్యను హుజూరాబాద్ డివిజన్ ఆర్‌ఎంపీల సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స చేసి ప్రభుత్వ దవాఖానాలకు సిఫారస్ చేయాలని సూచించారు. త్వరలో ఐడీ కార్డులు అందజేస్తామన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించి సమస్యల పరిష్కరించేలా కోరుదామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేందర్, మాధవరెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, సదానందం, దేవేందర్, మహేశ్, భాస్కర్ ఉన్నారు.

సన్మానం



భద్రేశంను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

చొప్పదండి: లయన్స్ జిల్లా 320జీ 2024–25 సంవత్సరానికి రెండవ ఉపగవర్నర్ పదవికి ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యుడు, జిల్లా అదనపు కార్యదర్శి లయన్ మోర భద్రేశం భారీ మెజార్టీతో గెలుపొందగా చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్‌లో 12 సంవత్సరాల నుంచి నిరంతర సేవా దృక్పథంతో పనిచేస్తున్నారని, మోర భద్రేశంను 320 జీ పరిధిలోని 103 క్లబ్‌ల సభ్యులు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. మోర భద్రేశం విజయంలో కీలక పాత్ర వహించిన చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. భద్రేశంను లయన్స్ క్లబ్ ప్రతినిధులు మహేషుని మల్లేశం, దూస రాము, మామిడి రాజేశ్, కొల్లూరి ఆనందం, కృష్ణహరి, పెద్ది లక్ష్మీకాంతం, తాటికొండ శ్రీనివాస్, జితేందర్ పలువురు పాల్గొన్నారు.

పంటలు చేతికందేనా

- యాసంగి వరి, మొక్కజొన్న పంటలకు పొంచి ఉన్న నీటి తడుల సమస్య
- మార్చి 31తో నీటివిడుదల ముగుస్తుందంటున్న అధికారులు
- భయాందోళనలో అన్నదాతలు
- ఏప్రిల్ నెలాకరు వరకు నీరువిడుదల చేయాలని కోరుతున్న రైతులు



పీచు దశలో మొక్కజొన్న



పొట్ట దశలో వరి చేను

జమ్మికుంట: ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు చేతికందనున్నాయి. మరో మూడు తడులు అందిస్తే పంటలు పండినట్టే. ఈ క్రమంలో పంటలకు సాగు నీరు అందుతుందా.. లేదా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ప్రభుత్వం కాలువ నీరు విడుదల చేయడంతో మొక్కజొన్న, వరి సాగుచేశారు. మూడు నెలల వ్యవధిలో పంటలు పూర్తి స్థాయిలో పండటం కష్టమేనని, ప్రభుత్వం కాలువ నీటిని ఏప్రిల్ నెలాఖరు వరకు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటల సాగు..

గతంలో పత్తి పంట వేస్తే అధిక వర్షాలతో దిగుబడి రాలేదని మొక్కజొన్న, వరి సాగుకు రైతులు అడుగులు వేశారు. మొక్కజొన్న, వరి పంట వ్యవధి 120 రోజులు. భారీ స్థాయిలో పెట్టుబడి పంటవైపు చూస్తున్నారు. కాలువల ద్వారా నీటిని మార్చి 31వరకు విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ పంట చేతికి వచ్చే సమయంలో నీటితడులతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వేసిన పంటను దక్కించుకునేందుకు పంట చేతికి వచ్చే వరకు నీరు విడుదల చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో సాగు వివరాలు..		
సాగు విస్తీర్ణం	2,93,668	ఎకరాలు
వరి	2,66,908	ఎకరాలు
మొక్కజొన్న	25,203	ఎకరాలు
వేరుశనగ	461	ఎకరాలు
పొగాకు	540	ఎకరాలు
పొద్దు తిరుగుడు	354	ఎకరాలు

నీటి విడుదల నిలిపేస్తే నష్టం

యాసంగి సాగుకు జనవరి 1వ తేదీ నుంచి ప్రభుత్వం నీరు విడుదల చేస్తోంది. వారబందీతో మార్చి 31వరకు ఆరు దఫాలుగా నీటివిడుదల ఉంటుందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఐదు దఫాలుగా నీరు విడుదల చేయగా మొక్కజొన్న పీచుదశ, వరి పొట్ట దశకు చేరుకున్నాయి. పంటలకు కనీసం నాలుగు నెల సమయం పడుతుందని రైతులు, వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. కానీ కాలువ పారకం ద్వారా నీటి విడుదల మూడు నెలలుగా కొనసాగుతూ చివరి వారబందీకి చేరుకుంది. పంటలకు మరో నెలరోజుల పాటు నీటి తడుల అవసరం ఉంటుంది. ఈ క్రమంలో నీటి విడుదల నిలిపేస్తే పంటలు ఎండి రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది.

నీరు విడుదల చేయాలి



కాలువ నీటి ఆధారంగా నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. పంట పీచు దశలో ఉంది. సరిగ్గా రెండు, మూడు తడులు అందిస్తేనే పంట పండుతుంది. ప్రభుత్వం మరో రెండు తడుల కోసం నీరు విడుదల చేయాలని కోరుతున్నాం. లేదంటే పంటలు ఎండిపోతాయి, పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోతాం.

– నేరెళ్ల సదానందం, రైతు, మడిపల్లి, జమ్మికుంట

అన్నారంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో తంటా



కాలిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

- నెల రోజుల్లో రెండుసార్లు కాలిపోయిన వైనం
- దీని పరిధిలో 20 ఎకరాల్లో వరి పంట
- నీరందక రైతుల ఇబ్బందులు

మానకొండూర్/కొత్తపల్లి(కరీంనగర్): కరెంట్ ఉన్నా వినియోగించుకోలేని, నీరు ఉన్నా పొలాలకు పారించలేని దుస్థితి. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. టీఎస్ఎన్‌పీడీసీఎల్ అల్గునూర్ సబ్ డివిజన్ మానకొండూర్ మండలంలోని అన్నారంలో 186 నంబర్ ట్రాన్స్‌ఫార్మర్ గత నెల 22న కాలిపోయింది. దీని పరిధిలో 20 ఎకరాల పొలాలున్నాయి. పొట్ట దశలో ఉన్న పంట నీరందకపోతే ఎండిపోతుందని ఆందోళన చెందిన రైతులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్గునూర్ సబ్ డివిజన్‌కు తీసుకెళ్లారు. సొంత ఖర్చులతో దాని స్థానంలో మరొకటి బిగించారు. కానీ, అది కూడా కాలిపోయింది. దీనికి అధిక లోడ్ కారణం కావడంతో ఏమీ చేయలేమని విద్యుత్ అధికారులు చేతులెత్తేయడంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. కెనాల్ నీటితో కొంతమేర పొలాలను కాపాడుకుంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో అందడం లేదని చెబుతున్నారు. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్ పొలాల మధ్యలో ఉండటం, రిపేరింగ్‌కు తీసుకెళ్లినప్పుడు పంట నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, వేలాడుతున్న వైర్లతో భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్‌కు త్వరితగతిన మరమ్మతు చేయించి, పంటలను కాపాడాలని తాళ్ల శేఖర్, పాకాల మల్లారెడ్డి, టి.రాజయ్య, శ్రీనివాస్ రెడ్డి, రాజయ్య తదితరులు కోరుతున్నారు.

లోడ్ వల్లే సమస్య..

అన్నారం ట్రాన్స్‌ఫార్మర్‌పై అక్రమ లోడ్ ఉండటం వల్ల తరచూ ఫ్యూజ్‌వైర్ పోయి సమస్య ఏర్పడుతోంది. దీని కింద 5 హెచ్‌పీ ఐదు మోటార్లకు మాత్రమే విద్యుత్ శాఖ అనుమతి ఉండగా.. మరో రెండు 7.5 హెచ్‌పీ మోటర్లను వాడుతున్నారు. అదనపు లోడ్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతులు విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. అప్పటివరకు సమస్య పరిష్కారానికి సహకరించాలి.

– ఫసి అహ్మద్, ఏఈ, మానకొండూర్



వరదకాలువకు నీటిని విడుదల చేయాలని ధర్నా చేస్తున్న ఆయా గ్రామాల రైతులు

సాగునీటి కోసం రైతుల ధర్నా

గంగాధర: వరదకాలువకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కొండన్నపల్లి, రంగరావుపల్లి, తాడిజర్రి, గర్శకుర్తి, ఆచంపల్లి గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. రెండు రోజుల క్రితం రాస్తారోకో చేయడానికి ప్రయత్నించగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నీటి విడుదల చేయిస్తానని హామీచ్చారని, ఆ నీళ్లు కురిక్యాల శివారు వరకు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులపాటు వరదకాలువకు నీటిని విడుదలచేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రైతుల రాస్తారోకోను విరమింపచేశారు.



వాటర్‌ప్లాంట్ తెరుచుకునేదెన్నడో..?

శంకరపట్నం: మండల కేంద్రంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్ మూతపడింది. గతంలో వాటర్ ప్లాంట్ నుంచి తాగునీరు తీసుకెళ్లిన గ్రామస్తులు కొద్ది నెలలుగా మూతపడటంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వేసవి సాకుతో ప్లాంట్ యజమానులు అధిక ధరలకు నీటిని విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు వాటర్‌ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయితీదారులపై కేసు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గడ్డం వేణు పంచాయితీదారుల పైన ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. సురేందర్ తెలిపారు. గ్రామానికి చెందిన గడ్డం వేణు తనభార్యతో మనస్పర్థలు రావడంతో కోర్టు ద్వారా విడాకులు తీసుకునేందుకు అంగీకారం కుదుర్చుకున్నారు. ఇందుకు ఇద్దరు పెద్దమనుషులు టి.రాజు, ఎల్.మల్లేశం జోక్యం చేసుకొని పంచాయితీ నిర్వహించారు. గడ్డం వేణు నుంచి రూ.రెండు లక్షలు ఇరువురు తమపేరిట బ్యాంకులో డిపాజిట్ చేయించుకున్నారు. దంపతుల విడాకుల అగ్రిమెంట్ కోర్టు ద్వారా పూర్తి కాకముందే వేణుకు తెలియకుండానే డబ్బులు డ్రా చేసుకుని సొంతానికి వాడుకున్నారు. విషయం తెలుసుకున్న వేణు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

మద్యం పట్టివేత

వీణవంక: మండలంలోని కనపర్తి, రెడ్డిపల్లిగ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.20,990 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. కనపర్తి గ్రామానికి చెందిన బోయిన రాజు ఎలాంటి అనుమతి లేకుండా బెల్టుషాపు నడుపుతున్నాడన్న సమాచారంమేరకు దాడి చేయగా రూ.4,200 విలువ గల మద్యం, రెడ్డిపల్లి గ్రామంలో చింతల రాజు ఇంట్లో రూ.16,790 విలువ గల మద్యం లభించిందని ఎస్సై తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పరిశోధనలపై దృష్టిసారించాలి

కరీంనగర్ సిటీ: పరిశోధనలతోనే సమస్యలకు పరిష్కారం కనిపెట్టాలని కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. కాలేజీలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఇంపార్టెన్స్ ఆఫ్ రీసెర్చ్ అండ్ కెరీర్ గైడెన్స్ అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, అడ్వైజర్‌గా కామర్స్ హెచ్‌ఓడీ, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య వ్యవహరించారు.

ఇంటింటికీ అక్షింతలు పంపిణీ



అక్షింతలు, చిత్రపటాలు అందజేస్తున్న రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు

రామడుగు: మండలంలోని వెలిచాలలో శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్సవాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ స్వామివారి చిత్రపటం, కల్యాణోత్సవ అక్షింతలు, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ సరోజన, ఆలయ పూజారి సావిత్రి రామానుజమ్, భక్తులు పాల్గొన్నారు.

భగవంతుని నామస్మరణతో ప్రశాంతత

జమ్మికుంట: భగవంతుని నామస్మరణతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం 25 వార్షికోత్సవం పుష్కర మహా కుంభాభిషేకంలో భాగంగా వెంకటేశ్వరశర్మస్వామి ఆధ్వర్యంలో శ్రీఅయ్యప్పస్వామి పుట్టినరోజు పురస్కరించుకొని పడిపూజ కార్యక్రమం సోమవారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక చింతనతోనే అనుకున్న లక్ష్యాలు, కోరికలు నెరవేరుతాయని, అయ్యప్పస్వామి దీక్ష భక్తిశ్రద్ధలతో కూడుకుందని అన్నారు. అయ్యప్పస్వామి దేవాలయం అభివృద్ధికి ధూపదీప నైవేద్యాలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మూడు రోజుల పాటు మహా కుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహించిన ఆలయ కమిటీకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిమల్ల జయేందర్, మామిడాల మనోహర్, అనుమాస రాజేందర్, ప్రతాప్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్‌రావు, ఇమ్మడి భాస్కర్, శ్రీధర్, మిల్కురి తిరుపతిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాటం చేస్తాం

మాజీ ఎంపీ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మానకొండూర్: ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆటోడ్రైవర్లు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి కార్మికుల పొట్ట కొట్టిందని, కార్మికుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎండా కాలంలో కూడా చెరువులు, కుంటలు నిండుకుండలా ఉండేవని ప్రస్తుతం సాగుకు కూడా ప్రభుత్వం నీటిని అందివ్వలేకపోతుందన్నారు. కరీంనగర్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయించానని, దేవుడి పేరు చెబుతూ బీజేపీ ఓట్లు దండుకోవాలనకుంటుందన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ జడ్పీచైర్మన్ తుల ఉమ, నాయకులు గెల్లి శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని చిన్నఆచంపల్లి గ్రామానికి చెందిన గుడి వెంకట్‌రాజిరెడ్డి, పెద్ద ఆసంపల్లి గ్రామానికి చెందిన రుద్ర భూమయ్య ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, గంగాధర మండల అధ్యక్షుడు నవీన్‌రావు, మాజీ సర్పంచ్ విజేందర్‌రెడ్డి, ఆకుల మధుసూదన్, పలువురు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి సహకరించాలి



రశీదు అందజేస్తున్న మేనేజర్ భూపాల్‌రెడ్డి

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ఇంటి, నల్ల, ట్రేడ్‌లైసెన్స్, వ్యాపార వాణిజ్య సంస్థలకు చెందిన యాజమానులు పన్నులు చెల్లించి మున్సిపల్ ఆదాయం పెంపొందే విధంగా సహకరించాలని మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యాపార సంస్థల పన్నుల వసూలు కార్యక్రమం నిర్వహించారు. మార్చి 31 వరకు పన్నుల చెల్లింపులో వడ్డీ మాఫీ ఉందని, అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రబలగాలు, పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్రబలగాలు

ఇల్లందకుంట: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని సిరిసేడు గ్రామంలో జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికలు ఐదేళ్లకోసారి వస్తాయని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, ఏఎస్ఐ రవి, ప్రజలు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చెట్ల నరికివేత



తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం ఇందుర్తిలోని సర్వేనంబర్ 936లో రెండెకరాల్లోని కబ్రస్తాన్‌లో ఉన్న చెట్లను నరికివేశారని మజీద్ కమిటీ సభ్యులు తహసీల్దార్ ఇప్ప నరేందర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. భూమిపై రెండేళ్లుగా వివాదం ఉందని, గతంలో చెట్లు నరికేస్తే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, రెండు రోజులు సెలవు రావడంతో కొందరు వ్యక్తులు కబ్రస్తాన్‌లోకి అక్రమంగా ప్రవేశించి చెట్లను నరికి నుస్తులాపూర్ సామిల్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

జమ్మికుంట: దాడికి పాల్పడిన ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన బొమ్మిడి రాజు జమ్మికుంట పట్టణంలోని దుర్గాకాలనీకి చెందిన ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని తరుచూ వాళ్ల ఇంటికి వెళ్లేవాడని, సోమవారం రాత్రి ఆ వ్యక్తి మహిళ ఇంటికి వెళ్లగా ఆమెతోపాటు కూతురు, అల్లుడు వచ్చిన వ్యక్తిని దూషిస్తూ, కుర్చీ, ఇటుకలతో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

కేసు నమోదు

కులం పేరుతో దూషించి, హత్యాయత్నానికి పాలప్డిన ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ వరగంటి రవి తెలిపారు. మహిళ, ఆమె కూతురు, అల్లుడిని కులం పేరుతో దూషిస్తూ హత్యాయత్నానికి పాల్పడగా తీవ్రగాయాలయ్యాయని దాడికి పాలప్డిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిక

హుజూరాబాద్: కమలాపూర్ మండలం కానిపర్తికి చెందిన గౌడ సంఘం అధ్యక్షుడు సంతోష్, మాల మహానాడు అధ్యక్షులు సంతోష్, ఇసంపెల్లి సురేశ్, తదితరులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.